సాక్షి అనకాపల్లి

బుధవారం । 25 । జూన్ । 2025



జగన్నాథస్వామి ఉత్సవాలు

అనకాపల్లిలోని శ్రీ బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి ఆలయంలో 27 నుంచి ఉత్సవాలు జరగనున్నాయి.

8లో

ఉష్ణోగ్రతలు

మంగళవారం	గరిష్టం/కనిష్టం
అనకాపల్లి	: 30.9/24.8

అనకాపల్లి: జిల్లాలో రాగల ఐదు రోజులలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండి, తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం తెలిపారు.



అమ్మ పేరుతో మొక్క

పెదగంట్యాడ: బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీలోని సామాజిక భవనంలో అమ్మ పేరుతో మొక్క నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

న్యూస్‌రీల్

అరగంటలో దొరికిన సెల్ ఫోన్



పోయిన సెల్‌ఫోన్ పట్టుకొని బాధితులకు తిరిగి అప్పగిస్తున్న సీఐ స్వామినాయుడు

కశింకోట: పోయిన అర్థ గంట వ్యవధిలోనే పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కనుగొని సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు. సీఐ అల్లు స్వామి నాయుడు అందించిన వివరాల ప్రకారం.. స్థానిక కస్పావీధికి చెందిన విశారపు నాగరాజు పనికి వెళ్లి ఇంటికి తిరిగి వెళుతూ మార్గంమధ్యలో మంగళవారం సాయంత్రం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నారు. ఇది సుమారు రూ.20 వేల ఖరీదు కలిగిన ఒప్పో సెల్‌ఫోన్. భార్య సరోజినితో కలిసి వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫోన్ పోయిన విషయాన్ని జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్‌లోని ఐటీ కోర్ విభాగానికి సమాచారం అందించారు. అక్కడి సిబ్బంది సమన్వయం చేసుకొని టవర్ లొకేషన్ ఆధారంగా ఎస్ఐ లక్ష్మణరావు సిబ్బందితో వెళ్లి సెల్‌ఫోన్‌ను స్థానిక రౌతు వీధి ప్రాంతంలో నాలుగైదు ఇళ్లు పరిశీలించిన మీదట పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. దాన్ని బాధితులకు అప్పగించామని సీఐ తెలిపారు. దీంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాకంపై కలెక్టర్‌కు ఫిర్యాదు



రోడ్లపై నిలిపిన విద్యా సంస్థల బస్సులు

నర్సీపట్నం: పట్టణంలో రామారావుపేట పరిసర ప్రాంతాల్లో ప్రైవేటు విద్యాసంస్థల నిర్వహణ వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని సామాజిక కార్యకర్త కె.శివనారాయణరాజు కలెక్టర్ విజయ కృష్ణన్‌కు ఫిర్యాదు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన విద్యార్థులను కాలేజీలు, పాఠశాలల వద్ద దించి, రోడ్లపైనే బస్సులు, ఆటోలు, వ్యాన్‌లు నిలిపివేయటం వల్ల ప్రజలు రాకపోకలు సాగించేందుకు నరకం చూస్తున్నారని పేర్కొన్నారు. విద్యాసంస్థల నిర్వాకం వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ విషయాన్ని స్థానిక పోలీసులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం లేదని శివనారాయణరాజు కలెక్టర్‌కు నివేదించారు.

విత్తనాల పంపిణీలో రాజకీయం

వడ్డాదిలో వేర్వేరుగా అందించిన టీడీపీ నేతలు



వరి విత్తనాలను పంపిణీ చేస్తున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట: రైతులకు వరి విత్తనాల పంపిణీలో కూటమి నేతలు రాజకీయం చేస్తున్నారు. వడ్డాది రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం రైతులకు సబ్సిడీ వరి విత్తనాల పంపిణీ చేపట్టారు. ముందుగా గ్రామానికి చెందిన రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, టీడీపీ ముఖ్య నాయకులు దొండా నరేష్, సయ్యపురెడ్డి మాధవరావు, ఇంటి అప్పారావు, తలారి శంకర్, కనక, మేడివాడ రమణ, ముత్యాల సూరిబాబులతో కలిసి వరి విత్తనాలు పంపిణీ చేశారు. తరవాత ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు వర్గీయులు మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు, కూటమి నేతలు దొండా గిరిబాబు, కోరుకొండ సూరి అప్పారావు, సయ్యపురెడ్డి శ్రీనివాసరావు, దొండా నానాజీ, శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, సింగంపల్లి రమేష్‌లతో కలిసి వరి విత్తనాలు పంపిణీ చేశారు. కూటమి నేతల వర్గ విభేదాల కారణంగా విత్తనాల కోసం వచ్చిన రైతులతో పాటు సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ భాగ్యలక్ష్మి ఇతర అధికారులు ఇబ్బందులు పడ్డారు.



ఎమ్మెల్యే రాజు వర్గం చేతుల మీదుగా పంపిణీ

శివ.. శివా..

- పంచదార్లలో భక్తులకు ఎన్ని కష్టాలో!
- ఆధ్యాత్మిక క్షేత్రంలో అపరిశుభ్రత
- మహిళల అగచాట్లు అన్నీ ఇన్నీ కావు
- శిథిలమవుతున్న శిల్పసంపద
- ఏళ్లు గడిచినా పునరుద్ధరించని ధ్వజస్తంభ శిఖరం
- కనుమరుగవుతున్న ప్రాచీన శివలింగాలు



ఉమా ధర్మలింగేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభంపై పునరుద్ధరించని శిఖర భాగం

అచ్యుతాపురం రూరల్: రాంబిల్లి మండలం పంచదార్ల పంచాయతీలోని ఓ మారుమూల గ్రామమైన ధారపాలెం ఆధ్యాత్మికంగా ఎంతో ప్రముఖమైనది. చారిత్రక ప్రాధాన్యమున్న పంచదార్ల శివాలయంలో రాతి కట్టడాలను పరిరక్షించేందుకు ఈ క్షేత్రాన్ని పురావస్తు శాఖకు అప్పగించారు. అయితే నాటి శిల్ప సంపదను గానీ, ఆలయ పవిత్రతను గానీ కాపాడే చర్యలేవీ కానరాక ఈ ఆలయం రోజురోజుకూ కునారిల్లిపోతోంది. అడుగడుగునా అపరిశుభ్రత తాండవిస్తోంది. సరైన మౌలిక సదుపాయాలు లేక భక్తుల అవస్థలు వర్ణనాతీతం. పంచదార్లలో పుణ్య స్నానం ఆచరించాక మహిళలు దుస్తులు మార్చుకునేందుకు కూడా సరైన గదుల్లేక ఇబ్బందులకు గురవుతున్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో పుణ్యక్షేత్రం పరిసరాలు మల విసర్జనలతో అపవిత్రమవుతున్నాయి. భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఆలయాల సమీపంలో మద్యం సీసాలు కనిపిస్తున్నాయి.

> చోళులు, చాళుక్యుల కాలంలో 13వ శతాబ్దంలో నిర్మించిన పురాతన ఆలయమది.. అపురూపమైన శిల్పసంపదకు ఆలవాలమది.. పంచ పాండవుల్లో ప్రథముడైన ధర్మరాజు చేతుల మీదుగా ప్రతిష్టించిన శివలింగం ఆయన పేరు మీదుగానే ఉమాధర్మలింగేశ్వర స్వామి పేరిట పూజలందుకుంటోంది.. పరమ పవిత్రమైన ఐదు ధారల నుంచి లభించే పుణ్య జలాలతో స్నానం ఆచరిస్తే పాపాలు తొలగిపోతాయని పంచదార్లకు వచ్చే భక్తుల విశ్వాసం. ఇంతటి విశిష్టత కలిగిన పుణ్య క్షేత్రం.. దేవదాయ ధర్మాదాయ శాఖతోపాటు పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్న ఆలయం నేడు కళావిహీనమై, అపరిశుభ్రతకు నిలయంగా మారింది.

మహిళా భక్తుల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు



నేను ఎప్పటికప్పుడు ఉమా ధర్మలింగేశ్వర స్వామి ఆలయానికి వస్తుంటాను. ఇక్కడ ధారలో స్నానాలు చేసిన అనంతరం దుస్తులు మార్చుకోవడానికి సరైన గదులు లేక ఇబ్బంది పడుతున్నాము. ఎక్కడెక్కడి నుంచో వస్తున్న భక్తులు కూడా అదే ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. మహిళలకు మరుగుదొడ్ల సదుపాయం కూడా లేదు. దూరాభారం నుండి వచ్చే భక్తులకు కనీస మౌలిక వసతులు కల్పన లేకపోవడంతో చెప్పుకోలేని ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుంది.

–గుడివాడ లక్ష్మి, శివ భక్తురాలు, కశింకోట గ్రామం

ఎవరికీ పట్టని ఆలయ రక్షణ



శిథిలమైన శివలింగం

దేవాలయంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తున్నప్పటికీ, ఆలయ కట్టడాలు మాత్రం దయనీయ పరిస్థితిలో ఉన్నాయి. ఆలయ శిల్ప కళానైపుణ్యం కనుమరుగవుతున్నా పట్టించుకునేవారు లేరు. ఆలయ స్తంభాలపై చెక్కిన శిలా శాసనాలపై తెలుపు సున్నం వేయడంతో అవన్నీ కనుమరుగు అయిపోతున్నాయి. ప్రాచీన ఆలయాల అభివృద్ధి పేరుతో శిథిలావస్థకు చేర్చే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎక్కడపడితే అక్కడ అనవసరంగా గ్రావెల్ తవ్వకాలు జరిపి ఆలయ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా చర్యలు చేపడుతున్నారు. అభివృద్ధి పేరిట తలపెట్టిన కార్యాచరణ అర్ధంతరంగా ఆగిపోవడంతో గ్రావెల్ మట్టి ధార నీటిలో పడి ధార నీరు కలుషితమవుతోంది. ఈ పరిస్థితి భక్తులను తీవ్ర వేదనకు గురి చేస్తోంది.



శిలా శాసనాలపై తెలుపు సున్నం.. శిథిలమైన ప్రాచీన శిల్ప కళ

పురావస్తు శాఖ అనుమతితోనే తవ్వకాలు

ధార ప్రదేశంలో ప్రహరీ గోడ కూలిపోకుండా భక్తులకు అసౌకర్యం కలగకుండా తగు చర్యలు చేపట్టామని ఆలయ కార్యనిర్వహణాధికారి తేజ తెలిపారు. పురావస్తు శాఖ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు ఆయన వివరణ ఇచ్చారు. తాను కొత్తగా బాధ్యతలు తీసుకున్నానని సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు.



అపరిశుభ్ర వాతావరణంలోనే పుణ్య స్నానం ఆచరించి ఆలయానికి వెళ్తున్న భక్తురాలు

ధ్వజస్తంభంపై లేని శ్రద్ధ.. తవ్వకాలపై ఎందుకో?

పంచదార్ల క్షేత్రానికి ప్రధాన ఆలయమైన శ్రీ ఉమాధర్మలింగేశ్వర స్వామి ఆలయం ఎదురున ధ్వజ స్తంభంపైన ఉండే శిఖరభాగం ఎప్పుడో హుద్‌హుద్ సమయంలో కూలిపోయింది. ధ్వజస్తంభం పూర్తిగా పాడైపోయినా నేటికీ పునఃప్రతిష్ట జరగలేదు. కానీ అభివృద్ధి పేరుతో వారికి నచ్చిన చోట జేసీబీలతో తవ్వకాలు జరుపుతున్నారు. ప్రాచీన శిల్పసంపదను కాపాడాల్సిన చోట పొక్లెయిన్‌తో పెకిలించవచ్చా అని ఆలోచించేవారే లేరు. పంచదార్ల పరిసర ప్రాంతాల్లో గుప్త నిధుల తవ్వకాలు జరిగితే స్థానికుల ఒత్తిడి మేరకు అధికారులు నిలిపివేయించినట్లు తెలుస్తోంది. ధార నీరు పూర్తిగా కలుషితమైపోతుంది. వర్షపు నీటికి గుంతల్లో నీరు చేరితే ఆ బురద నీటితోనే స్నానాలు చేస్తున్నారు. ప్రస్తుతం చాలా మంది మంచి నీరుగా తాగేందుకు, వంటలు చేసుకునేందుకు ఉపయోగించలేకపోతున్నారు. ఏవైనా మూగ జీవాలు చూసుకోకుండా తవ్వకాలు చేసిన గోతుల్లో పడినట్లైతే ధార ప్రదేశం పూర్తిగా దుర్గంధభరితమైపోతుంది. పవిత్రమైన ధార అపవిత్రమై భక్తులకు అసౌకర్యం ఏర్పడే అవకాశం ఉంది. కానీ పట్టించుకునే వారెవరు?



అభివృద్ధి పేరిట తవ్వకాలు

పీజీఈ సెట్‌లో సత్తా చాటారు



సాయి మౌనికకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు (జియో ఇన్‌ఫర్మేటిక్స్‌లో 5వ ర్యాంక్)



సాయి ఈశ్వర్ (కెమికల్ ఇంజనీరింగ్‌లో 6వ ర్యాంక్)



బొడబొళ్ల నీరజ (మెటలర్జీలో 7వ ర్యాంక్)

మునగపాక: ఏపీపీజీఈ సెట్ (ఆంధ్రప్రదేశ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2025)లో జిల్లా విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించారు. మునగపాకకు చెందిన సాయి మౌనిక జియో ఇన్‌ఫర్మేటిక్స్ విభాగంలో 5వ ర్యాంకు సాధించింది. ఆమె తల్లిదండ్రులు పెంటకోట శ్రీనివాసరావు, మహాలక్ష్మమ్మ దంపతులు వ్యవసాయ కుటుంబానికి చెందినవారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా మౌనిక కష్టపడి చదివి ఎంటెక్ ప్రవేశపరీక్షలో సత్తా చాటింది. ఆమె ఏయూలో జియో ఇన్‌ఫర్మేటిక్స్ విభాగంలో నాలుగేళ్లపాటు బీటెక్ చదువుకుంది. పీజీఈసెట్‌లో 73 మార్కులతో 5వ ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. నాసా లేదా ఇస్రో వంటి సంస్థల్లో ఉద్యోగం సంపాదించాలన్నదే తన ఆశయమని చెప్పింది.

దేవరాపల్లి మండలం నుంచి ఇద్దరు..

దేవరాపల్లి: ఏపీపీజీఈ సెట్‌లో మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు సత్తా చాటారు. దేవరాపల్లిలోని ఎస్సీ కాలనీకి చెందిన సబ్బవరపు సాయి ఈశ్వర్ కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో 65 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంక్ సాధించాడు. ఇతని తండ్రి రాజాబాబు ప్రైవేటు వైద్యం చేస్తుండగా, తల్లి గృహిణి. సాయి ఈశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం సాధించి ఉన్నత స్థానంలో స్థిరపడటమే తన ఆశయమన్నాడు. వేచలం గ్రామానికి చెందిన బొడబొళ్ల నీరజ మెటలర్జీ విభాగంలో 66 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంక్ సాధించింది. ఆమె తండ్రి అకుంనాయుడు మృతి చెందగా తల్లి కుమారి వ్యవసాయం చేస్తూ ఇద్దరు కుమార్తెలకు ఉన్నత చదువులు చెప్పిస్తోంది. పెద్ద కుమార్తె దివ్య హైదరాబాద్‌లో మార్కెటింగ్‌లో ఉద్యోగం చేస్తుండగా, చిన్న కుమార్తె నీరజ బీటెక్ పూర్తి చేసి ఏపీ పీజీఈ సెట్ రాసింది. 7వ ర్యాంక్ సాధించిన నీరజ మాట్లాడుతూ ప్రభుత్వ కొలువు సాధించి తమ కోసం అహర్నిశలు కష్టపడుతున్న తల్లికి తోడుగా నిలవాలని అనుకుంటున్నట్లు తెలిపింది.

కిరండూల్ గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: కేకే లైన్ పరిధిలో జరుగుతున్న పలు ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్ల ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24, 26, 30, జూలై 4, 8, 15, 18, 21, 23వ తేదీల్లో విశాఖపట్నం–కిరండూల్ (58501) పాసింజర్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 25, 27, జూలై 1, 5, 9, 16, 19, 22, 24వ తేదీల్లో దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖ చేరుకుంటుంది.

టీడీపీ నేత ఘరానా మోసం

- చిట్టీలు, రుణాల పేరుతో రూ.4.26 కోట్లకు కుచ్చుటోపీ
- కుటుంబంతో సహా గ్రామం నుంచి పరార్
- లబోదిబోమంటున్న బాధితులు



టీడీపీ నేత దాడిశెట్టి పైడియ్య (నానాజీ)

యలమంచిలి రూరల్: చిట్టీలు, వడ్డీ ఆశ చూపి భారీగా రుణాలు తీసుకుని ఒక టీడీపీ నాయకుడు సుమారు రూ.4.26 కోట్లు వసూలు చేసి పరారయ్యాడు. నమ్మకమే పెట్టుబడిగా సుమారు 250 మందికి టోకరా వేసిన ఈ సంఘటన యలమంచిలి మున్సిపాలిటీ పరిధి తెరువుపల్లిలో చోటు చేసుకుంది. బాధితులంతా లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. వివరాలివి.. తెరువుపల్లి గ్రామానికి చెందిన దాడిశెట్టి పైడియ్య అలియాస్ నానాజీ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు. గ్రామంలో విశాఖ డెయిరీ పాల సేకరణ కేంద్రంలో వేతన కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. పాడి రైతులతో ఉన్న సత్సంబంధాలను ఆసరాగా చేసుకుని, పలువురితో ఆర్థిక లావాదేవీలు నెరిపాడు. పైడిమాంబ చిట్ ఫండ్స్ పేరుతో రూ.లక్ష, రూ.2 లక్షల మొత్తాలకు పదికి పైగా చిట్టీల గ్రూపులు అనధికారికంగా నిర్వహిస్తున్నాడు. పాలకేంద్రానికి పాలు అందజేసే సభ్య రైతులకు చెల్లించాల్సిన వేతనాలను అప్పుగా తీసుకుని, ఆ మొత్తాలకు వచ్చే వడ్డీ సొమ్ముతో చిట్టీలు కట్టుకోవచ్చని ఆశ చూపాడు. అక్కడితో ఆగకుండా వందల మంది నుంచి రూ.3 కోట్ల వరకు అప్పుగా తీసుకున్నాడు. అప్పుగా తీసుకున్న మొత్తాలకు సరిపడా మొత్తాన్ని క్రమం తప్పకుండా అడిగిన వెంటనే ఇవ్వడం, చిట్టీలను బాగా నిర్వహించడంతో గ్రామస్థులంతా దాడిశెట్టి పైడియ్యను బాగా నమ్మారు. ఇలా గత 15 ఏళ్లుగా గ్రామంలో 50 శాతానికి పైగా ప్రజల వద్ద నుంచి పెద్ద ఎత్తున రుణాలు తీసుకున్నాడు. మరో వందమందికి పైగా చిట్టీలు వేశారు. పిల్లల వివాహాలు, చదువులు, భవిష్యత్తు అవసరాల కోసం పైడియ్యకు అప్పుగా ఇచ్చి పొదుపు చేస్తున్నామని భావించారు. కొందరు తమ బంగారు ఆభరణాలను వివిధ బ్యాంకులు, ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల వద్ద తాకట్టు పెట్టి మరీ పైడియ్యకు ముట్టజెప్పారు. చివరకు కొద్ది రోజులుగా వడ్డీ సక్రమంగా ఇవ్వకపోవడం, చిట్టీల డబ్బు, అప్పుగా తీసుకున్న సొమ్మును చెల్లించకపోవడంతో అనుమానం వచ్చిన కొందరు డబ్బు ఇవ్వాలని పైడియ్యపై వత్తిడి తెచ్చారు. అప్పుగా తీసుకున్న మొత్తాలకు కొందరికి ఫోర్జరీ సంతకాలతో ప్రామిసరీ నోట్లు ఇచ్చినట్టు తెలిసింది. తన మోసం బయటపడిందని తెలుసుకున్న టీడీపీ నాయకుడు పైడియ్య ముందుగా కుటుంబ సభ్యులను పంపించేశాడు. తర్వాత ఎవ్వరికీ అనుమానం రాకుండా గ్రామం నుంచి ఇటీవల సైలెంట్‌గా పరారయ్యాడు. తమను టీడీపీ నేత పైడియ్య మోసగించాడని తెలుసుకున్న బాధితులు రెండ్రోజులుగా యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తమకు న్యాయం చేయాలని మొరపెట్టుకుంటున్నారు. పెద్ద సంఖ్యలో బాధితులు ఉన్నారని తెలియడంతో పోలీసులు కూడా దీనిపై ఆశ్చర్యపోతున్నారు. బాధితులు ఎవరు, వారికి ఎంత మొత్తంలో మోసం జరిగిందో వివరాలు సేకరిస్తున్నారు. రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు బాధితులకు చెప్పారు. ఈ వ్యవహారంపై యలమంచిలి రూరల్ ఎస్సై ఎం.ఉపేంద్రను సంప్రదించగా బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్నామన్నారు. చిట్టీల ద్వారా 115 మంది బాధితులు రూ.కోటికి పైగా డబ్బు నష్టపోయినట్టు ప్రాథమికంగా తెలుస్తోందన్నారు.

పైడియ్యకు చిట్టీలు కట్టాను



మా గ్రామానికి చెందిన దాడిశెట్టి పైడియ్య వద్ద రూ.లక్ష చొప్పున రెండు చిట్టీలు కడుతున్నాను. మరొక రూ.5 లక్షలు అప్పుగా ఇచ్చాను. కొన్ని రోజుల నుంచి పైడియ్య కనిపించడంలేదు. ఆందోళనగా వుంది. అతనిని నమ్మి నా కష్టార్జితమంతా ఇచ్చాను. ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్‌కు వచ్చాను.

–బండి పెంటారావు, తెరువుపల్లి

రూ.10 లక్షలు అప్పగా ఇచ్చా



నా జీవితమంతా కష్టపడి కూడబెట్టుకున్న సర్వస్వం పైడియ్యకే ఇచ్చేశాను. రూ.10 లక్షలు అప్పుగా ఇచ్చాను. రూ.లక్ష చిట్టీ నెల నెలా చెల్లిస్తున్నాను. నేను,నా కుమార్తె అనారోగ్యంతో బాధపడుతున్నాం. ఇప్పుడు పైడియ్య కనిపించడంలేదు. ఫోన్ చేస్తే స్పందించడంలేదు. నాకు దిక్కుతోచడంలేదు.

–బండి సూరిబాబు, తెరువుపల్లి

ఉద్రిక్తత నడుమ 'ఎంటీఎస్' కౌన్సెలింగ్



డీఈవో కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు

ఆరిలోవ (విశాఖ): మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) టీచర్లకు మంగళవారం ఆందోళనల నడుమ కౌన్సెలింగ్ జరిగింది. ఏజెన్సీ ప్రాంతాల్లోని ఖాళీలను చూపించి బదిలీ ప్రక్రియ చేపడుతున్నారని, తమను మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ మూడు రోజులుగా ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం డీఈవో కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారులు వీరికి కౌన్సెలింగ్ నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు కౌన్సెలింగ్‌కు ఎవరూ హాజరు కావద్దని ఎంటీఎస్ ఉపాధ్యాయులు మరోసారి డీఈవో కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఈ ఆందోళన జరుగుతుండగానే 1998, 2008 డీఎస్సీ బ్యాచ్‌లకు చెందిన కొందరు ఉపాధ్యాయులు 'మేం కౌన్సెలింగ్‌కు హాజరవుతాం'అంటూ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో మిగిలిన వారు వారిని అడ్డుకోవడంతో గందరగోళం నెలకొంది. ఈ పరిణామాల నేపథ్యంలో డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ ఆరిలోవ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు డీఈవో కార్యాలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేయడంతో అధికారులు సుమారు 50 మందికి పైగా ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మిగిలిన వారు బుధవారం జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. ఇదిలా వుండగా తమ డిమాండ్ల పరిష్కారం కోసం విశాఖ ఎంపీ శ్రీభరత్, ఇతర ఎమ్మెల్యేలను కలవనున్నట్లు ఎంటీఎస్ ఉపాధ్యాయ యూనియన్ నాయకులు తెలిపారు.

మారుమూల ప్రాంతాలకు వెళ్లమని ఒత్తిడి

రెండో రోజు కొనసాగిన ఎంటీఎస్ టీచర్ల నిరసన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఎంటీఎస్ ఉద్యోగుల నిరసన

బీచ్‌రోడ్డు (విశాఖ): దూర ప్రాంతాలకు, రవాణా సౌకర్యం లేని మారుమూల పాఠశాలలకు వెళ్లాలని కూటమి ప్రభుత్వం తమపై ఒత్తిడి తెస్తోందని 1998, 2008 ఎంటీఎస్ టీచర్లు ఆవేదన వ్యక్తం చేశారు. రెగ్యులర్ ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్ తర్వాత మిగిలిపోయిన ఖాళీలను తమతో భర్తీ చేయాలని అధికారులు భావిస్తున్నారని తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద రెండో రోజు కూడా తమ నిరసనను కొనసాగించారు. మారుమూల పాఠశాలలను ఎంచుకోవాలని ఒత్తిడి చేయడం వల్ల తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నామని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. తమలో చాలా మంది 55 ఏళ్లు పైబడిన వారని, 70 శాతం మంది మహిళలే ఉన్నారని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఏజెన్సీ ప్రాంతాలకు పంపి పని చేయమనడం బాధాకరమని వాపోయారు. ప్రస్తుతం ఇస్తున్న రూ. 32,000 వేతనంతో కుటుంబాన్ని పోషించుకుంటూ.. మారుమూల ప్రాంతాల్లో పనిచేయడం తమ శక్తికి మించిన భారం అవుతుందని ఆవేదన చెందుతున్నారు. ఆర్.సి.నంబర్ 39 ఉత్తర్వుల ప్రకారం తమ నివాస ప్రాంతాలకు దగ్గరలో పోస్టింగ్ ఇవ్వాలని లేదా మైదాన ప్రాంతాల్లోని ఏకోపాధ్యాయ పాఠశాలలో రెండవ ఉపాధ్యాయునిగా నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం మొత్తం మీద విశాఖ పరిస్థితి ప్రత్యేకమైనదని, తమకు తగిన న్యాయం చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

క్లుప్తంగా

ప్రైవేటు కాలేజీల్లో నగదు చోరీ

నర్సీపట్నం: నర్సీపట్నంలోని రెండు ప్రైవేటు కాలేజీల్లో ఈ నెల 23వ తేదీ రాత్రి నగదు చోరీ జరిగింది. శ్రీ ప్రగతి జూనియర్ కళాశాలలో రూ.లక్షా 50 వేలు, ఎం.ఎల్.ఎ.ఎస్ కాలేజీలో రూ.4.25 లక్షలు చోరీ జరిగినట్లు కళాశాలల యాజమాన్యాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ గోవిందరావు, సిబ్బందితో కలిసి జోరీ జరిగిన కాలేజీలను పరిశీలించి, పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. క్లూస్ టీమ్‌తో ఆనవాళ్లు సేకరించారు. చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విత్తే ముందు విత్తనశుద్ధి అవసరం

అనకాపల్లి: రాగల వర్షాన్ని వినియోగించుకుని, వరి నారుమళ్లు వేసుకోవడానికి నేలను దున్ని తయారు చేసుకుని, 2 కిలోల యూరియా, 6 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్,1 కిలో మ్యురేట్ ఆఫ్ పొటాష్‌ను ఎకరానికి 20 కిలోల చొప్పున విత్తనం వేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఇన్‌ఛార్జ్ ఏడీ ఆర్ కె.వి.రమణమూర్తి అన్నారు. స్థానిక ఆర్‌ఏ ఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరుగా వరి విత్తే రైతులు, నేలను దున్ని తయారు చేసుకుని, విత్తడానికి అనుకూలమైన ఎంటీయూ–1262, 1224 వంటి వరి రకాలను ఎంపిక చేసుకుని కిలో విత్తనానికి 3 గ్రా. కార్బెండజింతో విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలన్నారు. వాతావరణ పరిస్థితులకు పూత దశలో ఉన్న అపరాలలో మారుకా మచ్చల పురుగు ఆశించే అవకాశం ఉన్నందున నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వి.గౌరి, ఆర్.సరిత, పి.వి.పద్మవతి, ఎ.అలివేణి పాల్గొన్నారు.

సెజ్ పరిశ్రమలకు సమ్మె నోటీసులు


సమ్మె నోటీసు ఇస్తున్న సిటు నాయకులు

అచ్యుతాపురం రూరల్: దేశవ్యాప్త కార్మిక సమ్మెలో పరిశ్రమల కార్మికులందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని యాజమాన్యాలకు మంగళవారం సిటు జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి రాము, మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు నోటీసులిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్పు చేస్తున్నాయన్నారు. జిల్లా కమిటీ సభ్యులు ఆర్ సత్తిబాబు, సన్యాసిరావు పాల్గొన్నారు.

నేలవేషాలు C/o ముచ్చర్ల







తగరపువలస : గ్రామదేవతల ఉత్సవాలు, వినాయక నిమజ్జనం, శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రముఖంగా కనిపించే నేలవేషాలు ప్రస్తుతం దాదాపు కనుమరుగైపోయాయి. అప్పట్లో పురాణ పురుషుల వేషాలు కట్టిన కళాకారులను దేవుని ముందు ఊరేగింపుగా ఎడ్లబండ్లపై తీసుకువెళ్లేవారు. వాళ్లను కూడా ప్రజలు భక్తిభావంతో చూసేవారు. ప్రస్తుతం నేల వేషాల స్థానంలో డీజే, కోలాటం, కాళికా నృత్యాలు వంటివి ప్రదర్శిస్తున్నారు. గ్రామాల్లో ఎడ్ల బండ్లు కూడా కనిపించకుండా పోయాయి. ఆనందపురం మండలం ముచ్చర్ల పంచాయతీవాసులు మాత్రం ఈ ఆనవాయితీని కొనసాగిస్తున్నారు. గ్రామదేవత బంగారమ్మ పండగలో చిన్నారులు మొదలుకుని యువకుల వరకు రామాయణం, మహాభారతం, భాగవతంలో పాత్రలతో పాటు అమ్మవార్లు, చాకలి తిప్పడు, షావుకారు, భైరవుడు, చిత్రగుప్తుడు తదితర వేషాలతో అలరిస్తున్నారు. అనకాపల్లి నుంచి మేకప్ కళాకారులు, డ్రస్సులు, కిరీటాలు, మేకప్ కిట్లు పట్టుకుని వచ్చారు. ఒక్కో నేలవేషానికి అలంకరణ బట్టి మేకప్‌తో కలిపి రూ.1000 నుంచి రూ.2000 ఖర్చు అవుతుంది. దీనిని ఉత్సవ కమిటీయే భరిస్తుంది.



ఈ ఏడాది 60 మంది ముందుకు..



పూర్వం నుంచి వస్తున్న ఆనవాయితీ ప్రకారం అమ్మవారికి మొక్కుకునేవారు ఈ వేషాలు వేయడానికి ముందుకు వస్తారు. అభినయం అక్కరలేకపోయినప్పటికీ కేవలం వేషం ద్వారా గ్రామస్తులు, బంధువులను మెప్పిస్తుంటారు. వేసిన పౌరాణిక పాత్రలో ఒదిగిపోతారు. కళాకారులు ఎక్కువైతే పలువురు ఒకే పాత్రలో అలరిస్తుంటారు. ఈ ఏడాది ముచ్చర్ల ఉత్సవ కమిటీ ఈ నేలవేషాలకు రూ.1.5 లక్షలు ఖర్చు చేస్తుంది. ఎండ్లబండ్ల స్థానంలో ట్రాక్టర్లు ప్రవేశించినా గత వైభవానికి తగ్గకుండా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం జరిగిన అనుపోత్సవంలో 60 మంది వరకు నేలవేషగాళ్లు అలరించారు. వీరిని చూడటానికే చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది ముచ్చర్ల తరలివచ్చారు.

సరదాతో పాటు మొక్కు



పురాణ పురుషుల వేషాలు ధరించడం వెనుక మొక్కు, సరదా, ఆనందం దాగి ఉంది. పూర్వం నుంచి మా గ్రామంలో వస్తున్న ఆనవాయితీ.

–షిణగం అప్పలస్వామి, ముని వేషధారి

మా గ్రామానికే పరిమితం



మా గ్రామంలో తప్ప ఇంకా ఎక్కడా ఈ వేషాలు కట్టం. కొందరు మాత్రం బయట గ్రామాలకు వెళ్తుంటారు. మేకప్, అలంకరణ ఖర్చులు భరిస్తుంటారు.

– షిణగం అప్పలరాజు, చిత్రగుప్తుడు వేషధారి

రహదారిపై మద్యం వాహనం బోల్తా


రోడ్డుకు అడ్డంగా బోల్తాపడిన మద్యం వాహనం

అచ్యుతాపురం రూరల్: అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వస్తున్న మద్యం వాహనం మంగళవారం కొండకర్ల కూడలి సమీపంలో రోడ్డు అడ్డంగా బోల్తా పడింది. ఆవును తప్పించడంలో అదుపుతప్పి వాహనం బోల్తాపడినట్టు సంఘటన స్థలంలో ఉన్న వారు తెలిపారు. బీరు బాటిల్లు, మద్యం సీసాలు కిందపడి పగిలిపోయాయి. ఎంత నష్టం కలిగింది అన్న విషయం ఇంకా తెలియాల్సి ఉంది. రహదారి చిన్నది కావడంతో మితిమీరిన వేగం, అదుపుచేయలేక పోవడం వల్లనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇష్టారాజ్యంగా వాహనాలు మితిమీరిన వేగంతో నడిపి ప్రమాదాలకు గురౌతున్నారని ప్రజలంటున్నారు.

బదిలీ ఉపాధ్యాయుల జీతాల సమస్యలు పరిష్కరించాలి


డీటీవో సుభాషిణికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయ్

అనకాపల్లి: విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల జీతాల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ కోరారు. జిల్లా ఖజానా అధికారి వి.ఎల్.సుభాషిణికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఉపాధ్యాయులు బదిలీలు, ప్రమోషన్లతో కొత్త పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించారని, పాత స్థానంలో పనిచేసిన కాలానికి నాన్-డ్రాయల్ తీసుకుని, కొత్త ప్లేస్‌లోనే జీతం బిల్లులు తయారు చేసుకునేందుకు ఎస్టీవోలకు తగిన సూచనలు చేయాలని ఆయన కోరారు. డీఈవో/సీఎస్ఈ శాంక్షన్ చేసిన క్యాడర్ స్ట్రెంత్ వివరాలను జిల్లాలోని ఎస్టీవోలకు సర్క్యులేట్ చేయాలని ఆయన కోరారు.

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం.. ఏలేరు కాలువకు శాపం

- లీకేజీ ద్వారా కాలువలో తగ్గిన నీటి ప్రవాహం
- పూడికలు, మరమ్మతులపై నిర్లక్ష్యం


చినగొలుగొండపేట వద్ద ఉధృతంగా ఏలేరు కాలువలో నీటి ప్రవాహం


ఎ.శరభవరం వద్ద పంటపొలాల్లో లీకేజీ నీరు

నాతవరం: ఏలేరు కాలువలో పూడికతీత, మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో లీకేజీ ద్వారా నీరంతా వృధాగా పోతుంది. విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు కాకినాడ జిల్లా ఏలేశ్వరం రిజర్వాయరు నుంచి కాలువద్వారా నీటిని తరలిస్తున్నారు. ఉమ్మడి జిల్లాల పరిధిలో 154 కిలో మీటర్ల పొడవునా ఏలేరు కాలువ ఉంది. ఈ కాలువ ద్వారా విశాఖపట్నం ప్రజలకు తాగునీరు ఎన్‌టీపీసీ, గంగవరం పోర్టు, ఏపీఐఐసీ తదితర పరిశ్రమలకు నీరు సరఫరా చేస్తున్నారు. రోజుకు ఏలేశ్వరం రిజర్వాయరు నుంచి నీటి అవసరాలను బట్టి 250 నుంచి 300 క్యూసెక్కులు నీటిని తరలిస్తుంటారు. ఏలేరు కాలువలో ప్రతి ఏటా వేసవిలో పూడిక తీసి కాలువకు మరమ్మతులు చేపట్టేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈఏడాది వేసవిలో ఏలేరు కాలువలో పూడికతీత పనులతో పాటు మరమ్మతు పనులు చేపట్టలేదు. ఏలేరు కాలువలో ఎక్కడ చూసినా పూడిక పెరిగిపోయి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటుంది. తుపానులు, వర్షాల సమయంలో నీటి ఉధృతికి అనేక చోట్ల కాలువ గట్టు కోతకు గురై గండిపడేలా దర్శనమిస్తున్నాయి. గం డిపడేలా దర్శన మిస్తున్నాయి. నాతవరం మండలంలో 12 పంచాయతీల పరిధిలో సుమారుగా 25కిలో మీటర్ల మేర ఏలేరు కాలువ ప్రవహిస్తుంది. జిల్లేడుపూడి వద్ద ఏలేరు కాలువకు సొరంగం మార్గం 3 కిలోమీటర్లు మేర ఏర్పాటు చేశారు. ఎ.శరభవరం, లింగంపేట, మన్యపురట్ల, ఉప్పరగూడెం, గునుపూడి, రాజుపేట అగ్రహారం , పీకేగూడెం, నాయుడుపాలెం, చినగొలుగొండపేట, పి.జగ్గంపేట, ఎం.బి.పట్నం గ్రామాల వద్ద ఏలేరు కాలువలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆయా ప్రాంతాల్లో పూడికతో పాటు ఏలేరు కాలువ శిథిలం కావడంతో నిత్యం లీకేజీ ద్వారా నీరంతా వృధాగా పోతుంది. ఎ.శరభవరం వద్ద పంటపొలాల్లో ఏలేరు కాలువలో లీకేజీ నీరు ప్రవాహం చూస్తే ఆయకట్టు భూములకు నీరు విడుదల చేసినట్టుగా కనిపిస్తుంది. కాలువలో పూడిక తీసి బలహీనంగా ఉన్న ఏలేరు గట్లు పటిష్టం చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై ఏలేరు కాలువ జేఈ గోపీనాథ్ మాట్లాడుతూ పూడికతీత మరమ్మతులు చేసేందుకు రూ.60 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. ప్రస్తుతం నర్సీపట్నం మండలం వేములపూడి దగ్గర ఏలేరు కాలువలో పూడికతీత పనులు చేస్తున్నామన్నారు. నీరు వృథాగా పోకుండా ఏలేరు కాలువలో నీటి ప్రవాహం తగ్గిస్తామన్నారు.

మిత్రుడిని పరామర్శించిన కాసేపటికే..

లంకెలపాలెం ప్రమాదంలో కన్నుమూసిన అనకాపల్లి వాసులు


రేబాక గ్రామంలో గాంధీ మృతదేహానికి అంతిమయాత్ర

అనకాపల్లి టౌన్: స్నేహితుడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. నీకేమీ పర్వాలేదు, మేమున్నామని ధైర్యం చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం పరితపించారు. అంతలో తామే అనంతలోకాలకి వెళ్లిపోయారు. సోమవారం రాత్రి లంకెలపాలెంలో జరిగిన భయానక రోడ్డు ప్రమాదం మిగిల్చిన చేదు జ్ఞాపకాలివి.. అనకాపల్లి మళ్ళవీధికి చెందిన బండారు రమణ విశాఖపట్నం కేజీహెచ్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. అతనిని పరామర్శించడానికి మిత్రులు కర్రి అప్పాజీ, పచ్చికూర గాంధీ, కొణతాల నాయుడు కారులో వెళ్లి రమణకు ధైర్యం చెప్పి తిరుగు ప్రయాణమయ్యారు. మధ్యలో షీలానగర్ జంక్షన్‌లో వైన్ షాపులో పనిచేస్తున్న మరో స్నేహితుడు కొణతాల అచ్చియ్యనాయుడిని కారులో ఎక్కించుకొన్నారు. లంకెలపాలెం జంక్షన్‌లో సిగ్నల్ పడడంతో వీరి వాహనం ఆగింది. ఇంతలో వెనుక నుంచి లారీ వచ్చి ఢీకొనడంతో వీరి కారు, సమీపంలో ఉన్న ద్విచక్రవాహనాలు, కంటెయినర్ ఒకదానికి ఒకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ఉన్న కొణతాల అచ్చియ్యనాయుడు, పచ్చికూర గాంధీ చనిపోగా కర్రి అప్పాజీ ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అగనంపూడికి చెందిన ఫార్మా ఉద్యోగి ఎర్రప్పడు కూడా ఈ ప్రమాదంలో చనిపోయారు.

తలలో నాలుకలా ఉండే గాంధీ

అందరికీ తలలో నాలుకలా ఉండే గాంధీ చనిపోయాడనే వార్తతో రేబాక గ్రామం ఉలిక్కిపడింది. గ్రామంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా తన కష్టంగా భావించి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండేవాడు. ఉమ్మడి కుటుంబానికి తనే పెద్ద దిక్కు కావడంతో గాంధీ లేని లోటు తీర్చలేనిదిగా కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. గాంధీకి భార్య, కూతురు, కొడుకు ఉండగా కూతురికి ఇటీవలే పెళ్లి చేశారు. మంగళవారం మధ్యాహ్నం వందలాదిమందితో గాంధీ అంతిమ యాత్ర జరిగింది. కొణతాల అచ్చియ్యనాయుడుకు వైన్ షాపులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. కూతురికి పెళ్లి చేశారు.

లంకెలపాలెం ఘటనలో గాయపడిన కొత్తకోట యువకులు


వైజాగ్ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రామ్‌కుమార్ (రాంకీ)


వైజాగ్‌లో చికిత్స పొందుతున్న తురాల శేషు

రావికమతం: లంకెలపాలెం కూడలి వద్ద సోమవారం రాత్రి లారీ బీభత్సం సృష్టించిన ఘటనలో రావికమతం మండలం కొత్తకోటకు చెందిన ఇద్దరు యువకులు సాలాపు రామ్‌కుమార్(రాంకీ), (27), తురాల శేషు(26) తీవ్రంగా గాయపడ్డారు. రామ్‌కుమార్, శేషు ఇద్దరూ నర్సీపట్నం శ్రీరామ్ చిట్స్‌లో కొంత కాలంగా పనిచేస్తున్నారు. ఇరువురు వాయిదాలు రికవరీ చేయడానికి బైక్‌పై విశాఖపట్నం వెళ్లి తిరిగి రాత్రి కొత్తకోట వస్తుండగా, లంకెలపాలెం కూడలి వద్ద ట్రాఫిక్ సిగ్నల్ పడడంతో ఆగారు. ఆ సమయంలో వెనుక వైపు గాజువాక నుంచి వేగంగా వస్తున్న లారీ సిగ్నల్ వద్ద ఆగకుండా ముందువున్న వాహనాలను తొక్కుకుంటూ దూసుకొచ్చి బీభత్సం సృష్టించింది. బైక్‌పై ఆగివున్న రామ్‌కుమార్, శేషులను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామ్‌కుమార్ కుడి కాలు, నడుముకు, శేషు తలకు, భుజంపై తీవ్ర గాయాలయ్యాయి. రామ్‌కుమార్‌ని కేజీహెచ్‌కు, శేషును మెడికవర్ ఆస్పత్రికి పోలీసులు తరలించారు. ప్రస్తుతం ఆ ఇద్దరూ అక్కడే వైద్యం పొందుతున్నారు.

కిశోరి వికాసంతో బాలికల బంగారు భవితకు పునాది


అంగన్‌వాడీ కేంద్రంలోసరుకులను పరిశీలిస్తున్న పీడీ సూర్యలక్ష్మి

నర్సీపట్నం: కిశోరి వికాసం కార్యక్రమం ద్వారా బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తున్నామని ఐసీడీఎస్ పీడీ ఎస్.సూర్యలక్ష్మి పేర్కొన్నారు. నర్సీపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి మున్సిపాలిటీలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలను పీడీ, సీడీపీవో జి.వి.రమణితో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల బాలికల విద్య, వైద్యం, మంచి ఆహారం అందించడమే కిషోర వికాసం ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లాలో 154 వరకు బాల్య వివాహాలను నిలుపుదల చేశామన్నారు. డ్రాపౌట్స్ తిరిగి చదువుకొనేలా ప్రోత్సహించడం, నైపుణ్యాభివృద్ధి, వృత్తి విద్య ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కార్యచరణ రూపొందిస్తున్నామన్నారు. జిల్లాలో తొమ్మిది ప్రాజెక్టుల పరిధిలో 1981 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఈ కేంద్రాల్లో గర్భిణులు 8337, బాలింతలు 7059, ఆరు నెలల నుంచి మూడేళ్ల పిల్లలు 43,231, మూడేళ్ల నుండి ఆరేళ్ల పిల్లలు 36433 మంది లబ్ధి పొందుతున్నారన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో 4858 మంది పిల్లలను చేర్పించామన్నారు. అంగన్‌వాడీల్లో ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నయిజ్) ప్రక్రియ జిల్లాలో 89 శాతం పూర్తి అయిందన్నారు. ప్రభుత్వం అనాథ పిల్లల కోసం మిషన్ వాత్సల్యం పేరుతో నెలకు రూ.4 వేలు ఆర్థిక సహాయం అందిస్తారన్నారు. పోక్సో కేసు బాధితులకు ఐసీడీఎస్ ద్వారా రూ.2 లక్షల వరకు సహాయం అందిస్తామన్నారు.

కొత్తూరులో బంగారం చోరీ

అనకాపల్లి టౌన్: మండలంలోని కొత్తూరు గ్రామంలో ఒక ఇంటిలో దొంగతనం జరిగింది. పట్టణ క్రైం ఎస్ఐ అల్లు వెంకటేశ్వరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో నివాసముంటున్న ఎ.తులసీరాణి ఈ నెల 21న ఇంటికి తాళం వేసుకొని విశాఖపట్నం వెళ్లారు. తిరిగి 23 తేదీ రాత్రి ఇంటికి రాగా ప్రధాన ద్వారం తాళం విరగగొట్టి ఉండడంతో కంగారుగా ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 60 గ్రాముల బంగారం పోయిందని గుర్తించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

27 నుంచి జగన్నాథ స్వామి ఉత్సవాలు

- తొలి రథయాత్రతో ప్రారంభం
- వచ్చే నెల 6న ముగింపు

అనకాపల్లి టౌన్: గవరపాలెంలోని శ్రీ బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి ఆలయంలో ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఉత్సవాలు ఈనెల 27న ప్రారంభమై జూలై 6న ముగియనున్నాయి. తొలిరోజు శుక్రవారం ఉదయం గవరపాలెం నుంచి స్వామి వారి తొలి రథయాత్ర ప్రారంభమవుతుంది. గూడ్స్‌రోడ్ ఇంద్రద్యుమ్న హాలు వద్దకు తీసుకువెళ్తారు. అక్కడ తొమ్మిది రోజుల పాటు భక్తులకు ప్రతి రోజూ ఒక్కో అవతారంలో స్వామి వారు దర్శనమిస్తారు. ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. స్థానిక కళాకారుల నుంచి జాతీయ స్థాయి కళాకారుల వరకు వేడుకల్లో పాల్గొంటారు. ముగింపు రోజున తిరుగు రథయాత్ర జరుగుతుంది. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై గూడ్స్‌రోడ్ నుంచి మళ్లవీధి, కోట్నివీధి భక్తులు చిననాలుగు రోడ్ల వరకు ఊరేగిస్తే.. అక్కడ వేల్పుల వీధి యువకులు మెయిన్‌రోడ్ గుండా శారదానది వరకు తీసుకు వెళ్లి మళ్లీ చిన నాలుగురోడ్ల జంక్షన్ వరకు తీసుకువస్తారు. అక్కడ నుంచి నెయ్యిలవీధి, గవరపాలేనికి చెందిన భక్తులు తీసుకువెళ్లి అగ్గిమర్రి చెట్టు వద్ద ఉన్న ప్రధాన ఆలయం వరకు ఊరేగిస్తారు. చివరి రోజైన జూలై 6వ తేదీ రాత్రి జగన్నాథస్వామి ఆలయంలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం జరుగుతుంది.

పునరావాస సమస్యలను పరిష్కరించాలి


డీఆర్‌వో సత్యనారాయణరావుకు వినతిపత్రం అందజేస్తున్న కోన మోహనరావు

అనకాపల్లి: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా లక్షలాది మంది గిరిజన, గిరిజనేతర ప్రజలు నిర్వాసితులయ్యారని,దశాబ్ద కాలంగా ప్రాజెక్టు నిర్మాణం కొనసాగుతూ ఉన్నప్పటికీ నిర్వాసితుల సమస్యలు నేటికీ పరిష్కరించలేదని రాష్ట్ర రైతు కూలీసంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం రైతుకూలీల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌వో సత్యనారాయణరావుకు వినతిపత్రం అందజేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పట్ల ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యంగా ఉన్నాయని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీలు, కొండమొదలు పంచాయతీ ప్రజలతో చేసుకున్న ఎంఓయులు అమలు చేయకపోవడం, నేటికీ అనేక పునరావాస సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయని, మారుతున్న ప్రభుత్వాలన్నీ ప్రాజెక్టు నిర్మాణం చుట్టూనే దృష్టి పెడుతున్నాయి తప్ప, నిర్వాసితుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కోశాధికారి గొర్లి రాజు, కమిటీ సభ్యులు అయితిరెడ్డి అప్పలనాయుడు, లగొట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

27 నుంచి జగన్నాథస్వామి ఉత్సవాలు



కశింకోట వేణుగోపాలస్వామి ఆలయంలోని జగన్నాథస్వామి

కశింకోట: స్థానిక రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 27 నుంచి జగన్నాథస్వామి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు తెలిపారు. పది రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు సాయంత్రం 6 గంటలకు సుభద్ర, బలభద్రస్వామితోపాటు జగన్నాథస్వామి విగ్రహాలతో రథోత్సవం నిర్వహిస్తామన్నారు. మరుసటి రోజు నుంచి వచ్చే జులై 6వ తేదీ వరకు ఆలయంలో రోజుకొక విష్ణు దశావతారాలతో స్వామి భక్తులకు దర్శనమిస్తారన్నారు. రోజూ విష్ణు సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు ఆలయంలో జరుగుతాయన్నారు. చివరి రోజు తిరుగు రథోత్సవం గ్రామంలో జరుగుతుందన్నారు. దీంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

వరి విత్తనాలు పంపిణీ



విత్తనాల పంపిణీ చేస్తున్న దృశ్యం

కశింకోట: మండలంలోని జెట్టపురెడ్డితుని రైతు సేవా కేంద్రంలో రైతులకు మంగళవారం వరి విత్తనాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన వివిధ రకాల విత్తనాలను రాయితీపై అందజేశారు. కార్యక్రమంలో చింతలపాలెం సర్పంచ్ కొట్టి రాము, ఉప సర్పంచ్ బళ్ల అప్పలకొండ, కూటమి నాయకులు జెర్రిపోతుల నూకినాయుడు, మరుపురెడ్డి గిరిబాబు, పులిమంతుల గణేష్, కోన రమణ, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జాతీయస్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు

పరవాడ: మండలంలోని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు హెచ్.కుమార్, కె.తనీష్‌సాయి, ఎం.లక్ష్యలు జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని హపూర్ జిల్లా ఘరముఖ్తేశ్వర్‌లో ఈ నెల 27న జరగనున్న 33వ జూనియర్ జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీల్లో సదరు విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను, కోచ్ రాజేష్‌ను పాఠశాల సీఈవో కె.నిశాంత్, ప్రిన్సిపాల్ అభినందించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 73 దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	----	----
రెండో రకం	----	----
మూడోరకం	3,300	3,650

అనకాపల్లి సినిమాలు

భైరవం	:రాజా
డ్రాగన్	:సత్యనారాయణస్క్రీన్-1
8 వసంతాలు	: సత్యనారాయణ స్క్రీన్-2
ఖలేజా	:పర్తిసాయి
సితారే జమీన్ పర్	:షిర్డీసాయి
పాప	:వెంకటేశ్వర
కట్టప్ప జడ్జిమెంట్	:శ్రీసత్య
హంటర్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 52 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు, బీ పాజిటివ్-15, ఓ పాజిటివ్-14, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 312 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

ప్రగతి బాటలో తుమ్మపాల



తుమ్మపాల గ్రామం గవరపేటవీధిలో డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

గత వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.2 కోట్లు మంజూరు

ఇంతవరకు రూ.1.70 కోట్లతో అభివృద్ధి

వివిధ దశల్లో మిగిలిన పనులు

అనకాపల్లి: గ్రామీణ పట్టణ ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న తుమ్మపాల మేజరు పంచాయతీ ఆదర్శంగా నిలుస్తోంది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో మంజూరైన రూ.2 కోట్లతో (మండల పరిషత్ నిధులు రూ.1.30 కోట్లు, 15వ ఫైనాన్స్ నిధులు రూ.70 లక్షలు) పలు అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఇంతవరకు రూ.1.70 కోట్లు పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. గవరపేట వీధిలో రూ.9 లక్షలతో డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. మరో రూ.30 లక్షలతో డ్రైనేజీ, సీసీరోడ్డు పనులు త్వరలో ప్రారంభించనున్నారు. ఇప్పటికే పంచాయతీ పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు, కల్యాణ మండపాలు, కమ్యూనిటీ హాళ్ల మరమ్మతులు పూర్తయ్యాయి.

గ్రామ పంచాయతీ ప్రత్యేకతలివే...

- మండలంలో ఎక్కువగా రైతులు, కౌలు రైతులు ఉండే గ్రామం ఇదే.
- గ్రామంలో సర్పంచ్‌తోపాటు, 18 మంది వార్డు మెంబర్లు, ఐదుగురు ఎంపీటీసీలు ఉన్నారు.
- శారదానది ఒడ్డున ఆనుకుని ఉండడంతో రెవెన్యూపరంగా 1800 (మెట్ట, పల్లం) ఎకరాల్లో వరి, చెరకు, చిరుధాన్యాలు పంటలను పండిస్తుంటారు.
- తుమ్మపాల పంచాయతీ పరిధిలో మెట్టభూమిలో రైతులు చిరుధాన్యాలు పండిస్తారు.
- రైతులు ఎక్కువగా ఉండడంతో పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుంది.
- ప్రతీ శనివారం తుమ్మపాల మెయిన్‌రోడ్డులో పశువుల సంత ద్వారా గేదెలు, ఆవులు, మేకలు, కోళ్లు, ఇతర జంతువులు అమ్మకాలు జరుగుతాయి. జిల్లాలో వివిధ మండలాల నుంచి రైతులు, ఇతర వర్గాల ప్రజలు సంతకు వస్తుంటారు. అదేరోజు పశువుల వ్యాపారం ద్వారా లక్షలాది రూపాయలు లావాదేవీలు జరుగుతాయి.
- రబీ సీజన్‌లో (ఎండాకాలం) నువ్వులు, జనుము, పొద్దుతిరుగుడు, అపరాలు పంటలు పండుతాయి.



తుమ్మపాలలో పాడిరైతు కుటుంబం

మేజరు పంచాయతీ : తుమ్మపాల
జనాభా : 30 వేలు మంది
ఓటర్లు : 17 వేల మంది

- విశాఖ డెయిరీతో పాటు అమూల్, తిరుమల పాల డెయిరీల ద్వారా వేలాది లీటర్ల పాలు అమ్మకాలు సాగడమే కాకుండా అనకాపల్లి పట్టణంలో కొంతమంది ప్రజలు ఇక్కడ నుంచి స్వచ్ఛమైన పాలు కొనుగోలు చేసుకుని గృహాలకు తీసుకెళ్తారు.
- పంచాయతీ పరిధిలో సంతబయలు కనకదుర్గ ఆలయం, గవరపేటవీధి సత్తెమ్మతల్లి ఆలయం వద్ద పెద్ద కోనేరులు ఉన్నాయి. కోనేరులో చేపలకు ప్రసిద్ధి. శారదానది ప్రవాహం ఉండడంతో వివిధ రకాల చేపలు అమ్మకాలు నిత్యం జోరందుకుంటాయి. అనకాపల్లి పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చేపలు కొనుగోలుకు నిత్యం తుమ్మపాల వస్తుంటారు.

చంద్రబాబు రోడ్డున పడేసిన కార్మికులను ఆదుకున్న జగనన్న..

గతంలో తుమ్మపాలకు ఒక ప్రత్యేకత ఉండేది. ఇక్కడ వి.వి.రమణ సుగర్ ఫ్యాక్టరీలో వందలాది మంది ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ కార్మికులు విధులు నిర్వహించేవారు. ఈ ఫ్యాక్టరీపై ప్రత్యక్షంగా పరోక్షంగా ఐదు వేల మంది వరకు ఆధారపడి జీవనం సాగించేవారు. ఈ ఫ్యాక్టరీని గత టీడీపీ ప్రభుత్వం మూసివేసింది. అప్పటి నుంచి కార్మికులకు వేతనాలు, ఇతర బకాయిలు చెల్లించలేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యాక్టరీ ఉద్యోగులు, డైలీవేజ్ కార్మికుల బకాయిలను రూ.5.60 కోట్లు చెల్లించారు.

- పంచాయతీ పరిధిలో 10 ఇటుకల పరిశ్రమలు ఉండడంతో స్థానికులతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన నిరుద్యోగులు కుటుంబ సమేతంగా ఉపాధి పొందుతున్నారు.
- ఐదు అంగన్‌వాడీ కేంద్రాలు, ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మూడు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. ప్రజలు రోగాలు బారిన పడకుండా నిత్యం వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఉంటారు. మూడు సచివాలయాలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్నాయి.
- చిన్నారులు, పెద్దలు, నిరుద్యోగులు ఖాళీ సమయంలో చదువుకునేందుకు పూర్వకాలం నుంచి శాఖా గ్రంథాలయం అందుబాటులో ఉంది.



తుమ్మపాలలో వరి పంట(ఫైల్)

గత ప్రభుత్వంలో అభివృద్ధి



గత వైఎస్సార్‌సీపీ హయాంలో పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేశాం. ప్రధాన పంట కాలువలు, పంచాయతీ పరిధిలో సీసీరోడ్లు, డ్రైనేజీ పనులు చేపడుతున్నాం. తుమ్మపాల కేంద్రంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. ఈ విషయమై మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానించాం.

– పంచదార్ల కన్నారావు, ఎంపీటీసీ తుమ్మపాల-2, అనకాపల్లి మండలం

మృతుల కుటుంబ సభ్యులకు పరామర్శ

అనకాపల్లి టౌన్: లంకెలపాలెం రోడ్డు ప్రమాద బాధిత కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీ వద్ద పచ్చికూర గాంధీ, కొణతాల అచ్చియ్యనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించారు. ప్రమాదం నుంచి బయటపడి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కర్రి అప్పాజీని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, సీనియర్ నాయకుడు గైపూరి రాజు తదితరులు పాల్గొన్నారు.



అప్పాజీని పరామర్శిస్తున్న మలసాల భరత్ కుమార్

ఆప్ గెలుపుపై హర్షం

అనకాపల్లి: గుజరాత్, పంజాబ్ రాష్ట్రాల్లో ఐదు అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఒక స్థానాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం హర్షణీయమని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ అంచెలంచెలుగా ఎదుగుతుందన్నారు. త్వరలో ఏపీలో అన్ని అసెంబ్లీ స్థానాల్లో పోటీకి సిద్ధంగా ఉండేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నామని పేర్కొన్నారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ



సీహెచ్‌ఎన్.అగ్రహారంలో అవగాహన కల్పిస్తున్న ఏవో రంగాచారి

అనకాపల్లి: ముందస్తుగా వర్షాలు కురుస్తున్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి పి.బి.రంగాచారి తెలిపారు. మండలంలో సీహెచ్‌ఎన్.అగ్రహారం, మార్టూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఎండీఎస్ విత్తనాలు విత్తనం, ఖరీఫ్ ముందస్తు పనులపై రైతులు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రకృతి వ్యవసాయ యజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఘనజీవామృతం, పిల్లిపెసర, జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట పంటలు వెయ్యాలన్నారు. ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త వి.గౌరీ మాట్లాడుతూ వరి నారుమడులు వేసే ముందు వరి విత్తనాలను సుడోమోనోసతో విత్తన శుద్ధి చేయాలన్నారు. విత్తన శుద్ధి చేయడం వల్ల తెగుళ్ల వ్యాపించడం తగ్గుతుందన్నారు. వరి పంటకి ఆశించే పురుగులు, వాటి యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు పొందాలని కోరారు. అనంతరం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, సిహెచ్.ఎన్. అగ్రహారం, మార్టూరు గ్రామాల సర్పంచులు కె.గోవిందరావు, కరణం రెవెన్యూ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: తెగుళ్ల నివారణకు వరి విత్తనాలు నాటే ముందు శుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎం. స్వప్న కోరారు. మండలంలోని కొత్తపల్లి, బుచ్చియ్యపేట, తేగాడ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ విత్తన శుద్ధి చేయడం వల్ల పొట్ట తెగులు, ఆకు ముడత తెగుళ్లను నివారించవచ్చునన్నారు. విత్తన శుద్ధికి ముందు సూడోమోనాస్ మందును కిలోకి 8 గ్రాముల వంతున కలిపి విత్తనాలను శుద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ మందు రైతు సేవా కేంద్రాల్లో 500 గ్రాముల మందుపై రూ.75 రాయితీతో అందివ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. కొత్త వరి విత్తన రకాలను అందుబాటులో ఉంచామన్నారు. ఎంటీయూ 1224, ఆర్‌జీఎల్ 2537, బీపీటీ 5204 రకాలను రాయితీపై రైతు సేవా కేంద్రాల్లో అందిస్తున్నామన్నారు. వీటి కోసం రైతులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో పండిస్తున్న పంటలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలిచ్చారు. ఏఈవో ఎం. లైలాదేవి, కూటమి నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



కొత్తపల్లిలో పంటలను పరిశీలిస్తున్న ఏవో స్వప్న

సీఈటీపీ నుంచి చెరువులు, కాలువల్లోకి వ్యర్థ రసాయనాలు

యాజమాన్యాలపై చర్యలకు సిటు నేత గనిశెట్టి డిమాండ్

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో నిబంధనలకు విరుద్ధంగా కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(సీఈటీపీ) నుంచి ఫార్మా వ్యర్థ జలాలను చెరువులు, కాలువల్లోకి విడుదల చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సీఈటీపీ నుంచి కాలువ ద్వారా ప్రవహిస్తున్న వ్యర్థజలాలను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వ్యర్థ రసాయనాలను శుద్ధి చేయకుండా బయటకు వదిలేయడంతో పరిసర గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. వర్షం పడిన ప్రతిసారీ ఫార్మా పరిశ్రమల నుంచి వ్యర్థ రసాయనాలను పెద్ద ఎత్తున కాలువల్లోకి వదిలేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యర్థ రసాయనాలు మొల్లోడి గెడ్డలోకి చేరి తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నాయని పేర్కొన్నారు. దీంతో స్థానిక ప్రజలు, మూగ జీవాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. ఇక్కడి గెడ్డలో గతంలో పీసీబీ అధికారులు తీసిన నమూనాల్లో పరిశ్రమలు సీటీవో అండ్ హెచ్‌డబ్ల్యూఏ నిబంధనలు పాటించట్లేదని నిర్ధారించారని పేర్కొన్నారు. ఫార్మా యాజమాన్యాలు విడిచిపెడుతున్న వ్యర్థ రసాయనాలపై నోటీసులిచ్చి చేతులు దులిపేసుకోకుండా, యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్ర పీసీబీ బోర్డుకు ఫిర్యాదు చేస్తున్నట్లు వెల్లడించారు. మొల్లోడి గెడ్డలో చేరిన వ్యర్థ రసాయనాలను మోటార్లతో వెంటనే తొలగింపు చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



సీఈటీపీ కాలువల ద్వారా ప్రవహిస్తున్న వ్యర్థ రసాయన జలాలను చూపుతున్న గనిశెట్టి

కార్యకర్తల్లో నూతనోత్తేజం కోసం మండల స్థాయి సమావేశాలు

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అమర్‌నాథ్

చోడవరం : పార్టీ కార్యకర్తల్లో నూతనుత్తేజం నింపేందుకు మండలాలు, గ్రామస్థాయిలో కార్యకర్తల సమావేశాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని చోడవరం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. ఈనెల 29న చోడవరం మండల స్థాయి కార్యకర్తల సమావేశాన్ని చోడవరంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా సమావేశం నిర్వహించే సీతారామ కల్యాణమండపాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. మండల స్థాయిలో జరిగే ఈ సమావేశానికి అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని అమర్‌నాథ్ కోరారు. ఆయనతోపాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, జిల్లా యూత్ అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్‌పల్లా నర్సింగరావు,, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, పందిరి శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు కందర్ప శంకర్, చిటికెల నాగేష్, మొల్లి సోమునాయుడు, బొడ్డు శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.



మండల సమావేశం నిర్వహించనున్న చోడవరంలో కల్యాణ మండపాన్ని పరిశీలిస్తున్న అమర్‌నాథ్

పండ్ల తోటల పెంపకానికి 100 ఎకరాల భూసేకరణ లక్ష్యం

రోలుగుంట : పండ్ల తోటల అభివృద్ధికి ఎన్ఆర్ఈజీఎస్ నుంచి ఈ ఆర్థిక సంవత్సరంలో ఎంపీడీవో వి.ఎస్.నాగేశ్వరరావు 100 ఎకరాలు లక్ష్యంగా నిర్ణయించారని, ఈ మేరకు అవసరమైన చర్యలు చేపట్టినట్టు ఏపీవో పి.ఈశ్వర్రావు మంగళవారం తెలిపారు. మండలంలో పలు గ్రామాల్లో రైతుల నుంచి 56 ఎకరాలు సేకరించడం జరిగిందన్నారు. మిగిలిన భూమి సేకరణకు ఈ నెలాఖరు వరకూ గడువు ఉందని తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎకరాకు మూడేళ్ల పంట అభివృద్ధి కోసం ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.98 వేలు రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. కొబ్బరి, జీడి మామిడి, పామాయిల్ తదితర పండ్ల తోటల అభివృద్ధికి ఈ అవకాశం వర్తిస్తుందని తెలిపారు.

వెదురు పొంతలు తొలగించాలని డీఎఫ్‌వోకు వినతి

నర్సీపట్నం : నర్సీపట్నం నుంచి తుని వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలోని పెదిమికొండ రిజర్వ్ ఫారెస్ట్‌లోని వెదురు పొంతలు రోడ్డుకు ఇరువైపులా వ్యాపించి ఉండడం తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని జనసేన నాయకులు అప్పన్న, ఎస్.ఎస్.జి.దొరబాబు, అద్దేపల్లి గణేష్ డీఎఫ్‌వో శామ్యూల్ దృష్టికి తీసుకువెళ్లారు. వెదురు పొంతలు మెయిన్‌రోడ్డుపై వ్యాపించి ఉండడం వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని, ప్రజాశ్రేయస్సు దృష్ట్యా వాటిని తొలగించాలని డీఎఫ్‌వోను కోరారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని డీఎఫ్‌వో హామీ ఇచ్చారు.

దివ్యాంగులకు దుప్పట్లు, గొడుగుల పంపిణీ

మాకవరపాలెం: దివ్యాంగులకు దుప్పట్లు, గొడుగులు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల దివ్యాంగ విభాగం అధ్యక్షుడు దివ్వా భూషణం కుమార్తె జన్మదినం సందర్భంగా మంగళవారం మండలంలోని జీ నగరం గ్రామంలో 100 మంది దివ్యాంగులకు దుప్పట్లు, గొడుగులు పంపిణీ చేశారు. వీటిని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ చేతుల మీదుగా పంపిణీ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిటికెల రమణ, పార్టీ నాయకులు రుత్తల వాసు, పెట్ల భద్రాచలం, బండారు గాంధీ, గంగరాజు, డీవీఎన్ రాజు, పక్కుర్తి సత్యనారాయణ, పంపాన రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



దుప్పట్లు, గొడుగులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, తదితరులు

కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

నర్సీపట్నం : మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల డిమాండ్లను తక్షణమే పరిష్కారం చేయాలని సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరు రోజులుగా కొనసాగుతున్న కార్మికుల పోరాటానికి సీఐటీయు నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనేక ఏళ్లుగా మున్సిపాలిటీలో మంచినీరు, విద్యుత్ తదితర పనులు చేస్తూ ఇంజినీరింగ్ కార్మికులు ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. వీరికి కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. ఉద్యోగ భద్రత లేదు, సంక్షేమ పథకాలు కూడా ఇవ్వడం లేదన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, నాయకులు అప్పలనాయుడు, మురళీ, నాయుడు, నాగేంద్ర, దుర్గా శేఖర్ పాల్గొన్నారు.



నిరసన శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు

కమిషనర్‌కు సమ్మె నోటీస్

అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్తున్నామంటూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్రకు సమ్మె నోటీసు అందజేశారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితిలో సమ్మెలోకి వెళ్తున్నట్టు కార్మికులు సమ్మె నోటీసులో పేర్కొన్నారు.

అల్లిగెడ్డ ఆక్రమణలపై రైతుల ఆగ్రహం

పొక్లెయిన్‌తో ఆక్రమణల్ని తొలగించిన టెక్కలిపాలెం రైతులు

సబ్బవరం: మండలంలోని టెక్కలిపాలెం రైతులు తమ భూములకు సాగునీటిని అందించే అల్లిగెడ్డ ఆక్రమణలపై ఆందోళనకు దిగి, పొక్లెయిన్‌తో మంగళవారం తొలగించారు. గెడ్డ వాగుకు సరిహద్దుల్ని గుర్తించి ఆక్రమణలను పూర్తిగా తొలిగించాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను కోరారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు దొగ్గ చిన్నయ్య, పైల రమణ తదితరులు మాట్లాడుతూ అల్లిగెడ్డ నుంచి వచ్చే నీటి ఆధారంగా తమ పూర్వీకుల నుంచి భూముల్ని సాగు చేస్తున్నామన్నారు. ఈ గెడ్డ బంగారమ్మపాలెం నుంచి యాతపాలెం, ఆరిపాక మీదుగా టెక్కలిపాలెంలోని పలు సాగునీటి చెరువులకు జలవనరులను అందిస్తోందన్నారు. సుమారు 54 అడుగుల వెడల్పున విస్తరించి ఉన్న ఈ గెడ్డ టెక్కలిపాలెంలోని పారమ్మ చెరువు, కోనేటి చెరువు, గవరవాని చెరువు, జమ్మునిపాత్రుని చెరువుతో పాటు నాయనమ్మపాలెం, అంతకాపల్లిలోని మునిడి బంద, రాజ్ చెరువులకు ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. ఆరిపాక రెవెన్యూ పరిధి టెక్కలిపాలెం సరిహద్దులోని సర్వే నెం.5లో 1.06 ఎకరాలు, సర్వే నెం.8లో 1.04 ఎకరాలు, సర్వే నెం.14లో 2.50 ఎకరాలు కలిసి మొత్తం 4.60 ఎకరాల వరకూ గెడ్డవాగు ఆక్రమణకు గురైనట్లు ఆరోపించారు. దీనిని కొంత మంది రైతులు ఆక్రమించుకుని గెడ్డకు మరోవైపు ఉన్న గట్టుకు ఓ ప్రైవేట్ లేఅవుట్ కోసం రహదారి ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. దీనికి ఇరిగేషన్ అధికారుల నుంచి ఏ విధమైన అనుమతులు లేనప్పటికీ, అధికారులు చర్యలు తీసుకోలేదని ఆక్షేపించారు. దీంతో పాటు ఇటీవల యాతపాలేనికి చెందిన మరి కొందరు గెడ్డను ఆక్రమించి, గెడ్డలో కల్వర్టు ఏర్పాటు చేసి తమ భూములకు రోడ్డు వేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పొక్లెయిన్ సాయంతో దాన్ని తొలగించారు. అధికారులకు ఫిర్యాదు చేయగా.. ఆరిపాక వీఆర్వో అప్పలరాజు, టెక్కలిపాలెం వీఆర్వో కామరాజు, సర్వేయర్ రవి తేజ, వీఆర్ఏ నర్సింగరావు తదితరులు పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదించి, చర్యలు తీసుకుంటామన్నారు. ఆందోళనలో రైతులు పంచాడ శ్రీను, గొంప నాయనప్ప, సిరికి శ్రీను, బర్ల శ్రీను తదితరులు ఉన్నారు.



అల్లిగెడ్డపై అక్రమ కల్వర్టు వద్ద రైతులు, అధికారులు



గెడ్డవాగులో అక్రమ కల్వర్టును అడ్డుకుంటున్న రైతులు